క్లుప్తంగా

నేడు మండల సమావేశం


ఎంపీడీవో, బాపన్నదొర

వై.రామవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన ఉదయం 10.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల స్థాయి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీవో బాపన్నదొర కోరారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్ అనర్థాలపై కళాజాత


కళాకారుల ప్రదర్శన

డుంబ్రిగుడ: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ వారి సుచనల మేరకు బుధవారం కించుమండ వారపుసంతలో మన్యసీమ కళాజాత బృందం హెచ్ఐవీ, ఎయిడ్స్ టీబీ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఆర్‌కేఎస్‌కే ఏరియా కౌన్సిలర్ ఎస్.నిర్మల, కళాజాత బృందం ప్రతినిధులు అప్పలరాజు, అచ్చిబాబు, రామరావు, ఈశ్వరరావు ఎన్‌జీవో ప్రతినిధి ఎల్.రామరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జి.మాడుగుల: మండలంలో ఎం.నిట్టాపుట్టు యూనిట్ పరిధిలో రోలంగిపుట్టు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సమావేశం జరిగింది. ఘన, ద్రవ జీవామృతం తదితర అంశాలపై రైతు సాధికార సంస్థ యూనిట్ ఇన్‌చార్జి మేడా ప్రసాద్ వివరించారు. రోలంగిపుట్టు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యా సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేసిన ఉత్తమ రైతును శాలువ కప్పి సన్మానించారు. రైతు సభ్యులు, వీవోఏ, ఏపీసీఎన్‌ఎఫ్, ఐసీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో మామిడి తోటల ధ్వంసం

మాడుగుల రూరల్ : మామిడి తోటలపై కోతులు దాడి చేసి పక్వానికి వచ్చిన కాయలను తెంపి కొరికి నాశనం చేస్తున్నాయి. మండలంలో కె.జె.పురం పంట పొలాల్లో కోతుల గుంపులు విచ్చల విడిగా సంచరిస్తూ పక్వానికి వచ్చిన మామిడి కాయలను పాడు చేస్తున్నాయి. దీంతో పాటు జీడి మామిడి, పనస పండ్లు కూడా పాడు చేస్తున్నాయి. కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ కూరగాయల పంటలు పాడు చేస్తున్నాయి. దబ్బకుంటు రహదారి పక్కన వేసిన వంగ, బీర ఇతర పంటలు ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బారి నుంచి రైతులను కాపాడాలని కోరుతున్నారు.

మోదకొండమ్మ జాతర ఏర్పాట్లపై నేడు సమావేశం

మాడుగుల : స్థానిక మోదకొండమ్మ ఆలయం వద్ద వచ్చే నెల 3వ తేదీన జరగనున్న మోదకొండమ్మ పండగ నిర్వహణకు మండల స్థాయి అధికారులతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం సమావేశం జరగనుందని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బండారు సత్యానారాయణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ పుష్పాల అప్పలరాజుతో పాటు ఇతర కమిటీ సభ్యులు హాజరు కానున్నారని, మండల అధికారులంతా హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

వరిలో సాగుపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

రావికమతం : కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మంగళవారం మత్సవానిపాలెం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో అధిక దిగుబడులు రావాలంటే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో పటం ద్వారా రైతులకు వివరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బీఎస్సీ విద్యార్థినులు గ్రామం మధ్యలో పటం వేసి వరిలో దిగుబడి తగ్గడానికి అధిక రసాయనాలు వాడటం, పంట మార్పిడి చేయక పోవడం కారణమని రైతులకు వివరించారు.


గుర్తేడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి


గుర్తేడు గ్రామ రహదారికి మధ్యలో ప్రమాదకరమైన వాగు

ప్రమాదకర వాగులు దాటి ప్రయాణం
అటవీశాఖ అడ్డంకులతో నిలిచిన పనులు
కలగా మిగిలిన గుర్తేడు రహదారి

నిర్లక్ష్యానికి నిదర్శనం

వై.రామవరం: అల్లూరి జిల్లా **రంపచోడవరం** నియోజకవర్గం వై.రామవరం **గ్రామం నుంచి** కొయ్యూరు మండలం మఠం **భీమవరం,** పోతవరం గ్రామాల మీదుగా వై.**రామవరం మండల** ఎగువప్రాంతానికి, అన్ని **పంచాయతీలను** కలిపే ఈ ప్రధాన రహదారిని నిర్మించాలని **మండల** ఎగువప్రాంత ప్రజలు కోరుతున్నారు. **ఈ** రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అడ్డంకులు **తొలగించి,** రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం**లో ఉన్నతాధికారులు,** పాలకులు పూర్తిగా విఫల**మైనట్టు మండల**వాసులు ఆరోపిస్తున్నారు. మండ**ల ఎగువ ప్రాంతమైన** పాతకోట గ్రామాల వ**రకు ఈ రోడ్డు** నిర్మాణం పూర్తి చేస్తేనే, జిల్లాలోనే **అతిపెద్ద విస్తీర్ణం** గల వై.రామవరం మండలాభివృద్ధి **సాధ్యపడుతుంది.** ప్రస్తుతం ఈమండలం ఎగువ, దిగువ, మధ్య అనే 3 బాగాలుగా విడి పోయి ఉంది. ఈ రోడ్డును నిర్మిస్తామని ఎన్నికల నాయకులు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కారని మండలవాసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి, ఈ రోడ్డు నిర్మాణనికి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అర్ధంతరంగా పనులు

వివరాల్లోకి వెలితే సుమారు 25 ఏళ్ల క్రితం అటవీశాఖ అడ్డంకులతో ఈరోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా నిలచిపోయింది. అప్పటి నుంచి ఆఅడ్డంకులను తొలగించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు న్నాయి. దీంతో మండల ఎగువ ప్రాంతవాసులకు ఈ రహదారి నిర్మాణం తీరని కలగా మిగిలింది.ఈ రోడ్డు నిర్మాణం మండల అబివృద్ధికి అతి ముఖ్యమైనది. ప్రస్తుతం పాతకోట, గుర్తేడు నుంచి మండల కేంద్రమైన వై.రామవరం రావలంటే మారేడిమిల్లి, రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, ఈనాలుగు మండలాలు దాటుకుని సుమారు 180 కిలోమీటర్లు చుట్టు తిరిగి రావలసి ఉంది. సుమారు 14 కిలో**మీటర్ల దూరం ఈ రోడ్డును నిర్మిస్తే, కేవలం 28 కిలోమీటర్ల దూరంలో గుర్తేడు నుంచి వై.రామవరం చేరవచ్చును. అయితే మార్గమధ్యలో ఉన్న కొయ్యూరు మండలం సరిహద్దు ప్రాంతంలో ఇప్పటికే రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు. వై.రామవరం మండల సరిహద్దులో సుమారు 14 కిలోమీటర్లు రోడ్డును మాత్రమే నిర్మించాల్సి ఉంది. ఈ** రోడ్డు నిర్మాణానికి 25 ఏళ్ల క్రితం రూ.3కోట్లు నిధులు మంజూరు కాగా, ఎర్తవర్క్ చేశారు. పనులు నిర్వహిస్తుండగా అటవీ శాఖాదికారులు రంగప్రవేశం చేసి, రోడ్డు నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేశారు.

సర్వేలకే పరిమితం

అయితే 2006 సంవత్సరంలో బీటీ రోడ్డు నిర్మాణం కోసం అదే రోడ్డుకు మరో రూ.5 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి నుంచి అటవీ శాఖాధికారులు ఆ రోడ్డుకు సర్వేలు చేయడమే గాని, నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదు. దశాబ్దాలు తరబడి ఐటీడీఏ అధికారులు, మంత్రుల చుట్టూ తిరిగినా పట్టించుకునే నాథుడు కరువయ్యారన్న ఆరోపణలున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం వలన ఆ ప్రాంతవాసులకు ఒక పక్క డబ్బులు, మరోపక్క సమయం ఆదా అవుతుంది. అలాగే మండల ఎగువ ప్రాంతంలో పాత కోట, గుర్తేడు, దారగడ్డ, కానివాడ, బొడ్డగండి, చింతలపూడి పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలోని సుమారు 100 గ్రామాలకు రహదారి, రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. ఈ రోడ్డును నిర్మిస్తే మండలం అబివృద్ధి చెందడంతో పాటు, ఒక పక్క విశాఖ జిల్లా, మరోపక్క ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలకు అతి దగ్గరగా ప్రధానమార్గం ఏర్పడుతుంది. ఈ సమస్యపై అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ సయ్యద్ షెహెన్‌షా మాట్లాడుతూ రహదారి పనులకు సంబంధించి వివరాలను ప్రభుత్వానికి పంపినట్టు తెలిపారు. తదుపరి ఆదేశాల మేరకు పనులు చేస్తామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అతి ముఖ్యమైన ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలి

గుర్తేడుగ్రామానికి వెళ్లేందుకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నాం. అటవీ మార్గం ద్వారా రాళ్లు తేలిన దారులపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఓవైపు అటవీ జంతువుల భయం..మరోవైపు గోతుల రహదారితో ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మార్గ మధ్యలో ప్రమాదకర వాగును దాటి గ్రామానికి చేరుతున్నాం. వర్షాకాలంలో గ్రామానికి చేరే పరిస్థితి లేదు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గుర్తేడు గ్రామానికి రహదారి నిర్మించాలి.

– రామారావు, గుర్తేడు, వై.రామవరం

15 నుంచి రిలే నిరాహార దీక్షలు


మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు మల్లయ్య

రంపచోడవరం: చింతూరు ఐటీడీఏ ప్రాంగణంలో ఈ నెల 15వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్టు ఆదివాసీ జేఏసీ డివిజన్ వైస్ చెర్మన్ వేటకాని మల్లయ్య బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ 2025 ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, జీవో నంబర్-3 పునరుద్ధరించాలని, 1/70 చట్టం పీసా చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలని ఏజెన్సీలోని ఉద్యోగాలను గిరిజనులతోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతూరు సంతపాకలలో ఈ నెల 16న సాయంత్రం జరిగే ఆదివాసీ హక్కుల గర్జన సభకు అధిక సంఖ్యలో గిరిజనులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వికాస్, కార్తీక్, నరేష్ , సూరి, విశ్వాంత్, శ్రీను, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాటం


కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్

అడ్డతీగల: లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. పలు కార్మిక సంఘాలతో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అడ్డతీగలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను తొలగించి వారిని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను కేంద్రం అమలుచేయనున్నట్టు చెప్పారు. ఇది దారుణమన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు అమలు నిర్ణయాన్ని ఆపాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. లేబర్ కోడ్‌ల అమలుని ఆపకుంటే కార్మిక సంఘాల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

18 నుంచి మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు


మోదకొండమ్మ ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పెదబయలు: మన్య ప్రజల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పెదబయలు మోదకొండమ్మ తల్లి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కిమంకరి బొంజుబాబు, తలారి చక్రధర్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నాయకులు మాట్లాడుతూ మోదకొండమ్మ తల్లి ఉత్సవాలను మే 18 నుంచి 20 తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలు విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎంపీపీ బొండా వరహాలమ్మ, సీతగుంట సర్పంచ్ పలాసి మాధవ రావు, వైస్ సర్పంచ్ గంగాధరం, కమిటీ నాయకులు సన్నిబాబు, రాధాకృష్ణ, శశిధర్, పూర్ణచంద్రుడు, చిట్టిబాబు, పూర్ణయ్య, లోలబాబు, అంజి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడులు


సమావేశంలో మాట్లాడుతున్న సిబ్బంది

ఎస్.రాయవరం: ప్రకృతి వ్యవసాయంతో కలుషితం లేని, నాణ్యమైన ఆహార ధాన్యాలు పండించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుజ్జి,కమల, కనకా రావు తెలిపారు. కోనవానిపాలెంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో ఎక్కువ ప్రాంతం వర్షాధారం అయినప్పటికీ సాధ్యమైనంత అధిక విస్తీర్ణంలో సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు పండించాలన్నారు.ప్రకృతి సేద్యంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి పుష్పాల సేవ

నందడిగా స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు


స్వామివారికి పూలంగిక సేవ చేస్తున్న అర్చకులు

చోడవరం: స్థానిక ఆపదహర శ్రీనివాస క్షేత్రంగా బాసిల్లుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు కన్నులపండువగా బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రాత్రి కన్నులపండువగా పూలంగిక సేవ చేశారు. పలు రంగుల పువ్వులతో స్వామివారి పూల పాన్పును తయారు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను సర్వాంగసుందరంగా అలంకరించి, పూలంగిక సేవ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శాంతారామాచార్యులు, వాసు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య పూలంగిక సేవ వైభవంగా జరిగింది. గ్రామంలో మహిళలు పెద్దసంఖ్యలో పూలు, పండ్లు తెచ్చి స్వామివారికి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ వింజమూరి శంకర్, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

నేడు మరిడిమాంబ పండగ



మునగపాక: మండలంలోని రామారాయుడుపేటలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక ప్రదర్శించనున్నారు.

తాగునీటి పథకాలు ప్రారంభం


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ త్రినాథ్, నేతలు, సమితి సభ్యులు


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, స్థానికులు

ముంచంగిపుట్టు: గ్రామాల్లో ఏర్పాటు చేసే తాగునీటి పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని సర్పంచ్ కె.త్రినాథ్ అన్నారు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ కెందుగూడ, మొంజగూడ, బొకాయిగూడ గ్రామాల్లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నవ నిర్మాణ సమితి నర్సీపట్నం ఆధ్వర్యంలో రూ.14లక్షలతో తాగునీటి పథకాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ త్రినాథ్, గ్రామ పెద్దలు, సమితి సభ్యుల సమక్షంలో నీటి పథకాలను ప్రారంభించారు. నీటి సరఫరా చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.త్రినాథ్ మాట్లాడుతూ నవ నిర్మాణ సమితి ఏర్పాటు చేసిన నీటి పథకాలతో మూడు గిరిజన గ్రామాలను నీటి సమస్య తీరిందన్నారు. కలుషితమైన నీటిని తాగుతూ వ్యాధుల బారిన పడిన గిరిజనులకు స్వచ్ఛమైన నీటి సరఫరా కలుగుతుండడంతో అందరూ ఆరోగ్యంగా ఉంటారని, రానున్న రోజుల్లో మరిన్ని గ్రామాలకు నీటి సౌకర్యం కల్పించాలని సమితి సభ్యులను ఆయన కోరారు. నవ నిర్మాణ సమితి మేనేజర్ వి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధురాం, సమితి సూపర్ వైజర్లు సుభద్ర, త్రినాథ్, గ్రామపెద్దలు జగన్నాథం, సూరిబాబు, నీలకంఠం, సీతారాం, డొంబ్రు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల, పోతవరం గ్రామాల్లో నవనిర్మాణ సమితి నిర్మించిన రెండు రక్షిత నీటి ట్యాంకులను సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్ బుధవారం ప్రారంభించారు. రెండు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపిన నవ నిర్మాణ సమితి సంస్థ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. దీనిలో పంచాయతీ కార్యదర్శి లీలకృష్ణ, నేతలు నారాయణ, తేజ, భారతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


కుళాయిలు పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్‌రావు

కంద్రుమ్‌లో కుళాయిల ఏర్పాటు

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ్ పంచాయతీ కంద్రుమ్ గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ. 2.50లక్షలతో ఇంటింటికీ కొళాయిలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు శెట్టి ఆనందరావు బుధవారం పనులు పర్యవేక్షించి నాణ్యతను పరిశీలించారు. ప్రతి ఇంటికి కుళాయిలు తప్పక ఏర్పాటు చేస్తున్నమన్నారు. వేసవిలో తాగునీటి కష్టాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రైతులను ఆదుకోవాలి


ఐటీడీఏ వద్ద రైతులతో కలసి ధర్నాలో పాల్గొన్న కల్పన

చింతూరు: ప్రభుత్వం ముందస్తు సాగు ప్రణాళికతో డివిజన్ రైతులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్ మాస్‌లైన్) జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో రైతులతో కలసి ఆమె ఏపీవో జగన్నాథరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్ నిమిత్తం ముందుగానే డివిజన్‌లోని ఆదివాసీ, పేద రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయాలని కోరారు. వ్యవసాయం చేసుకునేందుకు పరికరాలు సకాలంలో అందించాలని, పాత రుణాలు మాఫీ చేసి కొత్తగా వడ్డీలేని రుణాలు అందించాలని ఆమె డిమాండ్ చేశారు. పంటలు దిగుబడి రాక, సరైన ధరలేక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనిని నివారించేందుకు ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆమె కోరారు. నాయకులు నాగేశ్వరరావు, పొదయ్య, శిరమయ్య, చుక్కయ్య, జోగారావు, వాణి, లక్ష్మీదేవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోసారి వాయిదా పడిన పీసా కమిటీ ఎన్నిక


పీసా కమిటీ ఎన్నికకు హాజరైన ఓటర్లు

అడ్డతీగల: అడ్డతీగల పీసా గ్రామ కమిటీ ఎన్నిక వరుసగా ఆరోసారి వాయిదా పడింది. చేతులెత్తే విధానంలో నిర్వహించిన గ్రామ కమిటీ ఎన్నికకు ఓటర్లు రావడం లేదని గత సోమవారం బ్యాలెట్ విధానంలో ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. అయితే స్థానికంగా మూడు గ్రామాల నుంచి 3 వేల మంది ఓటర్లు ఉండగా 257 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరలా ఎన్నిక నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో బుధవారం ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేయగా 200 మంది మాత్రమే ఓటర్లు హాజరయ్యారు. ఎన్నికను తిరిగి మరోసారి నిర్వహించాలని నిర్ణయించారు. కోరం సరిపోవాలంటే 1006 మంది ఓటర్లు హాజరుకావాలని చెప్పి ఈనెల 21న ఎన్నిక నిర్వహిస్తామని తెల్పారు. డిప్యూటీ తహసీల్దార్ తేజస్విని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రహదారి పనులకు సర్వే

సాక్షి ఎఫెక్ట్..

రాజవొమ్మంగి: మండలంలో రూ. 8.60 కోట్లతో జరుగుతున్న రహదారి, పలు అభివృద్ధి పనులను టీడబ్ల్యూ ఈఈ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఉపాధి హామీ నిధులతో గత ప్రభుత్వ హయాంలో పలు రహదారి పనులు మంజూరు కాగా నేటికీ పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఈ సమస్యపై ఈనెల 5న 'సాక్షి'లో 'మోక్షమెన్నడో' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు జడ్డంగి, చిన్నయ్యపాలెం మీదుగా సింగంపల్లి రహదారి, రాజవొమ్మంగి, అప్పలరాజుపేట నుంచి కిమ్మలగడ్డ, ముర్లవారివీధి రహదారి, గొబ్బిలమడుగు రహదారి పనులకు సంబంధించి సర్వే చేశారు. త్వరలో ఆయా ప్రాంతాల్లో రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు పలుచోట్ల జరిగిన పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం రాజవొమ్మంగిలోని ఇంజినీరింగ్ శాఖ కార్యాలయాన్ని ఈఈ శ్రీనివాస్ సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట డీఈ గౌతమి తదితరులున్నారు.


రాజవొమ్మంగి మండలం ముంజవరప్పాడు వద్ద రహదారి పనులు పరిశీలిస్తున్న ఇంజినీర్లు

ఆంజనేయ స్వామి దీక్షలు

రావికమతం: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మత్సవానిపాలెం గ్రామంలో భక్తులు బుధవారం ఆంజనేయ స్వామి దీక్షలు చేపట్టారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి సుమారు 20 మంది భక్తులకు గ్రామ పురోహితులు వేపా ధర్మఫణి ఆధ్వర్యంలో సర్పంచ్ మలిచెట్ల గణేష్, గురుస్వామి సోమిరెడ్డి శివ మాలధారణ చేయించారు. తొమ్మిది రోజుల పాటు కఠినమైన నియామాలు ఆచరించి దీక్ష చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు అమ్మవారి పండగ

మాకవరపాలెం : రాచపల్లి జంక్షన్‌లో వెలసిన కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా ఈ పండగను స్థానికులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఘనంగా జరుపుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com